

స్ఫూర్తి ప్రదాత రామచంద్రమ్మ ఇకలేరు



మెటపర్తి రామచంద్రమ్మ (ఫైల్)

దెందులూరు, సెప్టెంబరు 13 : తన కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను, తన ఇంటితో సహ తన జన్మభూమి దెందులూరు గ్రామాభివృద్ధి, సంక్షేమానికి దానం చేసిన దాత, నేటితరానికి స్ఫూర్తి ప్రదాత అయిన మెటపర్తి రామచంద్రమ్మ (90) అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆమె అంత్యక్రియలు హైదరా బాద్‌లో శనివారం జరగనున్నాయి. కాగా ఆమె మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. 1934లో దెందు లూరులో కొల్లిపర్ర కాశీ విశ్వనాథం, వర లక్ష్మమ్మ దంపతులకు ఆమె జన్మిం చారు. ఆమె అమెరికాలో డల్లాస్‌లో బిజినెస్ అడ్మిషన్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ముంబై, హైదరాబాద్ సిండికేట్ బ్యాంక్‌లో డైరెక్టర్‌గా రీజనల్ ఆఫీ సర్‌గా, బ్రాంచి మేనేజర్‌గా పని చేశారు. తన గ్రామానికే చెందిన మెటపర్తి వెంకట సుబ్బారావుతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమా రుడు మెటపర్తి వెంకట్ ఉన్నారు. భర్త వెంకటసుబ్బారావు 2018లో మృతి చెందారు. కాగా తమ జన్మభూమి అభి వృద్ధికి రామచంద్రమ్మ నడుం కట్టారు. దెందులూరులో తహసీల్దార్, ఎంపీ డీవో, విద్యాశాఖ, మీ సేవ, గ్రంథాలయం భవనాలతో పాటు జడ్పీ ఉన్నత పాఠశాల, పోలీస్ స్టేషన్, టీటీడీ కల్యాణ మండపం, దేవాలయాలు, మినరల్ వాటర్ ప్లాంట్, ఆస్పత్రికి స్థలాలతో పాటు భవనాలను అందించడమే కాకుండా పేదలకు దాదాపు వంద మందికి ఇళ్ల స్థలాలు అందించారు. దెందులూరులో ఉన్న తన ఇంటిని శిశు సంక్షేమ కార్యాలయం (బాల సదనం)కు దానం చేస్తూ 2023లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు పత్రాలు అందించారు. దెందులూరు మండలంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 కోట్ల విలువైన ఆస్తులను రామచంద్రమ్మ దానం చేశారు. దెందులూరు అభివృద్ధికి, విద్య ,పేదరిక నిర్మూలనకు ఆమె భర్తతో కలసి కృషి చేసి వేలాది మందికి జీవితాన్ని అం దించారు. మరోవైపు కుమారుడు వెంకట్ సైతం విజయవాడ, గన్నవరం, హైదరాబాద్‌లో ఉన్న తమ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు నామ మాత్రపు ఫీజుకే విద్యను అందిస్తున్నారు. బ్లడ్ బ్యాంకులను నిర్వహిస్తున్నారు.



అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు తన ఇంటిని బాలసదనానికి దానం చేస్తూ పత్రాలు అందిస్తున్న రామచంద్రమ్మ (ఫైల్)

చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు మృతి

- అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ తుది శ్వాస
- నేడు స్వగ్రామం కె.ఎస్.రామవరంలో అంత్యక్రియలు
- కేవీపీకి అశోక్ శ్రీనివాస్ స్వయానా బావమరిది

కామవరపుకోట, సెప్టెంబరు 13 : మండలంలోని కె.ఎస్.రామవరానికి చెందిన వైసీపీ నాయకుడు, చింతలపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మబంధువైన కేవీపీ రామచంద్రరావు బావమరిది మేడవరపు అశోక్ శ్రీనివాస్ (65) అనారోగ్యంతో విశాఖలో ఓ ఆస్పత్రిలో చికిత్స శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని ఒక ప్రత్యేక వాహనంపై అభిమానులు వెంట రాగా ఆయన స్వగ్రామానికి శుక్రవారం రాత్రి తీసుకొచ్చారు. కె.వి.పి.రామ చంద్రరావు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కిలారు సత్య నారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, కామవరపు కోట మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, కామవరపుకోట వైస్ సర్పంచ్ మేడూరి రంగబాబు, జడ్పీటీసీ కడిమి రమేష్, ఎంపీడీవో కె.శ్రీదేవి, ఏవో సత్యవాణి, మండల పరిషత్ సిబ్బంది, ఈవోఆర్డీ మరిడయ్య, పంచాయతీ కార్యదర్శులు, కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షుడు ఘంటా సత్యం బాబు తదితరులు అశోక్ నివాసానికి విచ్చేసి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈయన సతీమణి మేడవరపు విజయలక్ష్మి ప్రస్తుతం కామవరపుకోట ఎంపీపీగా ఉన్నారు. అశోక్ శ్రీనివాస్ మృతితో మండలంలో విషాదం నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో ఆయన నియోజక వర్గంలో కీలక వ్యక్తిగా వ్యవహరించారు. మాజీ సీఎం జగన్‌తో ఆయనకు మంచి అనుబంధం ఉంది. అశోక్ శ్రీనివాస్ అంత్య క్రియలు కె.ఎస్. రామవరం గ్రామంలో శనివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.





అశోక్ శ్రీనివాస్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్.. (ఇన్‌సెట్‌లో) అశోక్ శ్రీనివాస్ (ఫైల్)



ఎమ్మెల్యే చంటి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్పొరేటర్లు

వైసీపీకి మరో ఎదురు దెబ్బ

- టీడీపీలో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 13 : ఏలూరు నియోజకవర్గంలో వైసీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. నగర పాలక సంస్థ పాలక మండలిలో వైసీపీ ఖాళీ అవుతోంది. కొన్నిరోజుల క్రితం 20 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరగా శుక్రవారం బడేటి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో మరో ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఏలూరు నగర పాలక సంస్థ పాలక మండలిలో 50 మంది కార్పొరేటర్లు ఉండగా 47 మంది వైసీపీ కార్పొరేటర్లలో ఇద్దరు ఎన్నికల ముందే టీడీపీలో చేరగా ఎన్నికల తర్వాత మరో 20 మంది, ప్రస్తుతం మరో ఐదుగురుతో కలిపి ఇప్పటి వరకు 27 మంది టీడీపీ గూటికి చేరారు. ఇంకా మిగిలిన కార్పొరేటర్లు కూడా టీడీపీ వైపు చూస్తున్నారు. భవిష్యత్తులో అదే జరిగితే పాలక మండలిలో వైసీపీ ఖాళీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రవీణ్‌కుమార్-8వ డివిజన్, దారపు అనూష- 14వ డివిజన్, జె.సాంబశివరావు-23వ డివిజన్, సత్యవతి-42వ డివిజన్, జె.కనక రాజేశ్వరి- 43వ డివిజన్ శుక్రవారం ఎమ్మెల్యే చంటి సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకు ముందు ఈ ఐదుగురు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు రాజీనామా పత్రం పంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగరాభివృద్ధికి సహకరించే ప్రజా ప్రతినిధులను పార్టీలో చేర్చుకుంటామన్నారు. టీడీపీలోకి రావడానికి మిగిలిన వైసీపీ కార్పొరేటర్లు క్యూ కడుతున్నారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో కలిసి పని చేసి నగరాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, టీడీపీ నేతలు పెద్దిబోయిన శివప్రసాద్, ఎంఆర్‌డీ బలరామ్, బొద్దాని శ్రీనివాస్, రెడ్డి నాగరాజు, షైబాబు పాల్గొన్నారు.

రుణాలు రీషెడ్యూల్ చేయాలి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 13 : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వరదల కారణంగా నష్టపోయిన రైతాంగం, ప్రజలకు రుణ సౌకర్యంపై కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంకర్లతో ప్రత్యేక డీసీసీ సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రకృతి సృష్టించిన విలయాన్ని విపత్తుగా ప్రకటించి రైతులు, ప్రజలకు బ్యాంకర్లు ఉపశమన చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రైతుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో బ్యాంకుల చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులు తీసుకున్న రుణాలకు కొంత మారిటోరియం సమయం ఇచ్చి రీ షెడ్యూల్ చేయాలన్నారు.



శనివారపుపేట తమ్మిలేరు కాజ్‌వేపై వరదనీరు (ఫైల్)

ఎన్నో కలలు.. నిధులే ఆటంకం!

పాలనా పగ్గాలు చేతికొచ్చి వంద రోజులు దగ్గర పడుతోంది. శాసన సభ్యులుగా తమకంటూ ఒక ముద్ర ఉండాలని కొత్త సిట్టింగ్‌లు తాపత్రయపడతున్నారు. ఆ దిశగానే నిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగానికి రాతపూర్వకంగా సమర్పిస్తూనే ఉన్నారు. వీలైనంత మేర రాష్ట్ర మంత్రులను కలిసి నియోజకవర్గాల్లో కావాల్సిన అవసరాలను, నిధుల గురించి ఏకరువు పెడతున్నారు. స్వయంగా ముఖ్య మంత్రి చంద్రబాబును కలిసి సమస్య పరిష్కరించుకోవడానికి ఇంకొందరు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పాలన గాడిలో పడుతుండగా నిధుల కొరత వెన్నాడుతూనే ఉంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- తాజాగా ఎమ్మెల్యేలు సరికొత్త ప్రతిపాదనలు
- ఏలూరులో తమ్మిలేరు కాజ్‌వేకు త్వరలోనే మోక్షం
- కొండవాగులపై వంతెనల కోసం నిరీక్షణ
- నియోజకవర్గాల్లో పేరుకుపోయిన పెండింగ్‌లెన్నో..
- పరిష్కారం కోసం నిధుల లేమి
- అయినా వీలైనన్ని పనులకు ఆమోదం దిశగా కూటమి ప్రభుత్వం

ఒక్కొక్కటిగా.. నింపాదిగా

నియోజకవర్గాల్లో ఐదేళ్లపాటు పేరుకుపోయిన సమస్యలు ఒక ఎత్తయితే గడిచిన మూడు నెలల్లోను భారీ వర్షాల కారణంగా కొత్తగా ఎదురైన సమస్యలు మరికొన్ని. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి దాదాపు 65 వేలకుపైగా మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గంలో ఏలూరు నగరమే అత్యంత కీలకం. నగరంలో పారిశుధ్యం, రోడ్లు, వీధిలైట్లు, స్థానిక సమస్యలు వెన్నాడుతూనే ఉంటాయి. గడిచిన మూడు నెలలుగా భారీ వర్షాలు కురియడంతో నగరంలో రోడ్లు దెబ్బతిన్నాయి. శనివారపుపేట కాజ్‌వేపై ఈ రెండు నెలల్లోనే తమ్మిలేరు పోటెత్తి మూడుసార్లు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేపై శాశ్వత పక్కా వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఏలూరును ముంచెత్తిన తమ్మిలేరు వరదతో పాటు శనివారపుపేట కాజ్‌వేపై సుమారు ఐదు అడుగుల ఎత్తున నీటి ప్రవాహాన్ని స్వయంగా చూశారు. కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి వీలుగా పనులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆపై ఎటువంటి కదలిక లేదు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు అప్పటి డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి అనుకూలంగా అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డిని ఒప్పించి ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడేలా చేశారు. ఐదేళ్ల గడిచినా వంతెనకు అతీగతీలేకుండా పోయింది. తాజాగా ఎమ్మెల్యేగా గెలిచిన బడేటి చంటి దీనిపై దృష్టి పెట్టారు. జల వనరుల మంత్రి రామా నాయుడును కలిశారు. కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి ఇటీవల ఏలూరు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నామని, తక్షణం పనులు ప్రారంభించాల్సిందిగా సీఎం చంద్రబాబు కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. ఏలూరు నగరంలో గడిచిన పదిహేనేళ్లుగా ఉన్న అతి పెద్ద సమస్య పరిష్కారానికి మరోసారి కదలిక వచ్చింది. దెందులూరు నియోజకవర్గంలోను అనేక సమస్యలు ఉండగా వీటిలో కొన్నింటిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సైతం సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో పెదపాడు మండలంలో తరచూ 300 ఎకరాల్లో ముంపునకు కారణమవుతున్న లోయర్ కాల్వ మరమ్మతులకు విజ్ఞప్తి చేయగా వాటికి సీఎం చంద్రబాబు ఆమోద ముద్ర వేశారు. కైకలూరు నియోజకవర్గ పరిధిలోని ఉప్పుటేరు ముఖ ద్వారం వద్ద ఉన్న అసలైన సమస్యను ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, రఘురామకృష్ణంరాజు సైతం పరిష్కారం నిమిత్తం ఇప్పటికే పదేపదే కోరుతూ వచ్చారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తమ్మిలేరు, బుడమేరు, రామిలేరుతోపాటు అనేక జల వనరులు ఉగ్రరూపం దాల్చి కొల్లేరును ముంచెత్తితే జరుగుతున్న నష్టం ఏమిటో తాజా వరదలతో తేలిపోయింది. ఉప్పుటేరు ముఖ ద్వారం వద్ద రైల్వేట్రాక్ అత్యంత దిగువన నిర్మితమై ఉండడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలిగించడం వంటి సమస్యలను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తేగలిగారు. రైల్వేశాఖతో చర్చించి దీనికి శాశ్వత పరిష్కారం కనుగొంటామని సీఎం భరోసా ఇచ్చారు.

మిగతా నియోజకవర్గాల్లోనూ కొన్ని హామీలు

చింతలపూడి నియోజకవర్గంలో కొన్ని పెండింగ్ పనుల పరిష్కారానికి అవకాశం కల్పించాలని తాజాగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సైతం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి నివేదిక సమర్పించారు. తన నియోజకవర్గంలో తాము ఏమి ఆశిస్తున్నామో ఆ నివేదికలో ఎమ్మెల్యే పొందుపరిచారు. వీటి పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇంకోవైపు పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలోని కొండవాగులపై ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణాల పరిస్థితులను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సరాసరిన రూ.70 కోట్లకు పైగా నిధులు ఇస్తే వాగులపై వంతెనల నిర్మాణానికి వీలుంటుందని భావిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో అనేక సమస్యలు ఎదురవుతుండగా వీటిపైనా స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నూజివీడు నియోజకవర్గం నుంచి మంత్రి పార్థసారధి ప్రాతినిధ్యం వహిస్తుండగా రాబోయే మూడు నెలల్లోనే కొన్ని పనుల అంకురార్పణకు ఆయన సైతం ప్రయత్నిస్తున్నారు.

పుట్టా రూటే సపరేటు

సాధారణంగా ఎంపీగా గెలుపొందిన వారంతా ప్రధాన సమస్యలపైనే దృష్టి పెడతారు. తాజాగా ఏలూరు నుంచి గెలిచిన పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ దీనికి భిన్నంగా ప్రతిస్పందించారు. ఇప్పటికే ఆయన ఏలూరు వాసులకు ఇచ్చిన హామీ మేరకు వందే భారత్ రైలు ఏలూరులో ఆగేలా కీలక భూమిక పోషించారు. ప్రజలకు తాను ఇచ్చిన హామీలపై సంబంధిత మంత్రులను ఢిల్లీలో ఇప్పటికే ఎంపీ స్వయంగా కలిశారు. అత్యంత కీలకమైన పామాయిల్ రైతుల సమస్యలను ఆయా మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్తూనే ఇంకోవైపు వర్జీనియా పొగాకు ధర విషయంలోను రైతుల అభిప్రాయాలకు అనుకూలంగానే అమలయ్యేలా కేంద్రం నుంచి సరైన ఆదేశాలు పొందడంలో సక్సెస్ అయ్యారు ఎంపీ మహేశ్ యాదవ్. మరిన్ని హామీల అమలు దిశగా వేగంగా చొరవ ప్రదర్శిస్తున్నారు.



మెస్‌లో స్వయంగా భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీ

ట్రిపుల్ ఐటీలో భోజనాలపై ఎంపీ తీవ్ర అసంతృప్తి

నూజివీడు, సెప్టెంబరు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాల పరిస్థితి ఏ మాత్రం మెరుగు పడలేదని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంపీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. క్యాంపస్‌లోని శాప్ భవనంలో ట్రిపుల్ ఐటీ అధికారులను, మీడియాను బయటకు వెళ్లమని అంతరంగికంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటీలో నెలరోజుల క్రితం నాటి సమస్యలు యథావిధిగానే ఉన్నాయని విద్యార్థులు ఎంపీకి స్పష్టం చేసినట్టు తెలిసింది. సుమారు రెండున్నర గంటలపాటు విద్యార్థులతో ఎంపీ సమావేశమయ్యారు. వారితో కలిసి మెస్‌లో భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మెస్‌ల పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదని, తాను వస్తున్నానని తెలిసి ఈ రోజు కొద్దిగా భోజన నాణ్యతలో జాగ్రత్తలు తీసుకున్నారని విద్యార్థులు తెలిపారన్నారు. కాంట్రాక్టర్ అందర్నీ ఆయన మేనేజ్ చేస్తున్నాడని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానన్నారు. ఉన్నత ఆశయాలతో ఏర్పాటుచేసిన ఈ ట్రిపుల్‌ఐటీలు వైసీపీ ప్రభుత్వహయాంలో పూర్తిగా నాశనం అయ్యాయన్నారు.

ఇక ఇద్దరు ఎంఈవోల స్థానే ఒకరికే పరిమితం ?

- కాంప్లెక్స్ హెచ్‌ఎంలకే సర్వాధికారాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : పాఠశాల విద్యావ్యవస్థలో పెను మార్పులు/ సంస్కరణలు రానున్నట్టు శుక్రవారం ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన మండల, డివిజన్‌స్థాయి విద్యాశాఖాధికారుల సమావేశంలో ఉన్నతాధికారులు సంకేతాలు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు వున్న 163 స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్యను సుమారు 125కి కుదించనున్నారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో కనీసం 35 మంది సెకండరీగ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) ఉండేలా కేడర్ స్ట్రెంగ్త్‌ను ప్రామాణికంగా తీసుకుని కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇకమీదట కాంప్లెక్స్ హెచ్‌ఎంకు విశేష అధికారాలు రానున్నాయి. ఆ ప్రకారం ఎస్జీటీలకు సంబంధించిన సర్వీస్ మేటర్లు, సెలవుల మంజూరు తదితర ఎగ్జిక్యూటివ్ అధికారాలన్నీ ఇపుడున్న ఎంఈవోల నుంచి కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బదలాయించనున్నట్టు సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం మండలస్థాయిలో వున్న ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను సవరించి ఒక ఎంఈవో మాత్రమే ఉండేలా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంఈవో-2 ని తొలగించడంతో పాటు, ఎంఈవో-1ని కేవలం పాఠశాలల తనిఖీ అధికారిగా మాత్రమే అధికారాలను పరిమితం చేయనున్నట్టుసంకేతాలు ఇచ్చారు. ఎంఈవో-2లందరూ ఇక పంచాయతీరాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగానే వెనక్కి వెళ్లిపోవడం ఖాయంగా ప్రచారం జరుగుతోంది. సమావేశంలో డీఈవో అబ్రహం, డీవైఈవోలు ప్రకాష్, సేవియా, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ఉప్పుటేరు..

- కొల్లేరు ముంపు సమస్య పరిష్కరిస్తాం..
- అవసరమైనచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణం
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం
- మంత్రి కొలుసు హామీ.. ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కామినేనితో కలసి పర్యటన

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 13 : ఆపరేషన్ ఉప్పుటేరు పేరుతో కొల్లేరు ముంపు సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర పౌర సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. కైకలూరు, మండవల్లి మండలాల్లోని కొల్లేరు ముంపు గ్రామాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. పెంచికల మర్రు, పందిరిపల్లిగూడెం గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొల్లేరుకు వరద ఎగువ నుంచి ఎక్కడికి వస్తుంది, పరిష్కారదిశగా చేపట్టాల్సిన చర్యలను ఎమ్మెల్యే కామినేని మంత్రికి వివరించారు. కొల్లేరు వరద నీటిలో బోటులో ప్రయాణం చేస్తూ పందిరిపల్లిగూడెంకు చేరుకున్నారు. అక్కడ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అంది స్తామన్నారు. కొల్లేరు ముంపు సముద్రంలోనికి వెళ్లే ఉప్పుటేరు ఆక్రమణను తొలగించి ముంపు నివారణను చేపడతామన్నారు. కొల్లేరులోనికి డ్రెయిన్లను ఆధునీకీకరణ చేసి రెగ్యులేటర్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ముంపు బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పుటేరుపై ఆక్రమణలు, రెగ్యులేటర్ నిర్మాణంపై ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని వాటి నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేసేలా చూస్తానని భరోసా ఇచ్చారన్నారు. కొల్లేటి వరద ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఉప్పుటేరును వెడల్పు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మండవల్లి మండలంలోని పెద్దఎడ్లగాడి వద్ద, మణుగులూరు కొల్లేరు ముంపు ప్రాంతాల్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చావలిపాడు కాలనీని సందర్శించారు. గ్రామంలో అన్ని కుటుంబాలు ముంపు బారిన పడ్డారని, అయితే 20 కుటుంబాలకు మాత్రమే ప్రభుత్వం సహాయం అందిస్తున్నారని బాధితులు తెలపగా అందరికి సహాయ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అటవీశాఖ డివిజనల్ అధికారి రవి శంకర్, ఆర్డీవో కాజావలీ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, కేకే బాబు, తోట లక్ష్మీ, బంకపల్లి సీతమ్మ, చావరాల దుర్గాప్రసాద్, మండవల్లి తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో వెంకటరమణ, ఆనందబాబు పాల్గొన్నారు.



కైకలూరు మండలం బోటులో వెళుతూ కొల్లేరు వరద ముంపును పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కామినేని

ముంపు నీటిలోనే లంక గ్రామాలు

మండవల్లి/ముదినేపల్లి, సెప్టెంబరు 13: మండవల్లి మండలంలోని కొల్లేటిలంక గ్రామాలు వారం రోజు లుగా కొల్లేరు వరద నీటిలోనే మగ్గుతున్నాయి. మణుగులూరు, పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామ్ నగర్, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కిళ్లపాడు, చింతపాడు, కొవ్వాడ లంక గ్రామాలు నేటికీ ముంపు నీటిలోనే మగ్గుతున్నాయి. లంక గ్రామాల ప్రజలు పడవలు, బోట్లు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. కొల్లేరు లంక గ్రామాల్లో నీరు తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాములు బెడద బాగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మండవల్లి మండలం కొల్లేటి ప్రాంతంలో రాకపోకలకు పడవలే దిక్కు...

కొల్లేరు ఉధృతితో స్తంభించిన మేజర్ డ్రెయిన్లు

కొల్లేరు, ఉప్పుటేరుల వరద ఉధృతికి ముదినేపల్లి ప్రాంతంలోని మూడు మేజర్ డ్రెయిన్లు స్తంభించాయి. కొల్లేరులో నీటి మట్టం తగ్గకపోవడంతో పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్, ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్లు, వాటికి సంబంధించిన మీడియం, మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో పోల్‌రాజ్, కొమ్మిలేరు పరీవాహక ప్రాంతాల్లోని వేలాది ఎకరాల్లోని సార్వా వరి పైరు ముంపు నుంచి తేరుకోవడం లేదు. పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్ కోమటి లంక వద్ద కొల్లేరు సరస్సులో కలుస్తుండగా, పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్లు తాడినాడ వద్ద ఉప్పుటేరులో కలుస్తాయి. కొల్లేరు, ఉప్పుటేరుల ఉధృతి తగ్గే వరకు ఈ డ్రెయిన్‌లో నీరు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ఈలోగా వేలాది ఎకరాల్లోని వరి పైరు కుళ్లిపోయే పరిస్థితి కనిపిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఏలూరు బజార్ బ్రాంచ్ (02715), ఏలూరు, ఏలూరు జిల్లా

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 8(1) & 8(2) క్రింద)

ఇందుమూలముగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏలూరు బజార్ బ్రాంచ్, ఏలూరు, ఏలూరు జిల్లా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నెం.3 ఆఫ్ 2002) ప్రకారము మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 నందలి రూలు 3తో చదివే సదరు సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత /హామీదారులు: 1. శ్రీ పెనుకుదురు సూరి బాబు, తండ్రి : సుబ్బారావు, ఫ్లాట్ నెం: 201, 2వ అంతస్తు, రత్నా ఎన్‌క్లేవ్, మారుతీ నగర్, చింతలపూడి, ఏలూరు జిల్లా-534460. మరొక చిరునామా: శ్రీ పెనుకుదురు సూరి బాబు, తండ్రి : సుబ్బారావు, ఇంటి నెం:12-4, కొప్పుల వారి వీధి, కాంగ్రెస్ కార్యాలయం వెనుక వైపు, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా -534460. మరొక చిరునామా: సూర్య ఫుడ్ ట్రాన్స్‌పోర్ట్, ప్రొప్రయిటర్ : శ్రీ పెనుకుదురు సూరి బాబు, తండ్రి : సుబ్బారావు, 2వ అంతస్తు, 15-247, రత్నా ఎన్‌క్లేవ్, మారుతీ నగర్, చింతలపూడి, ఏలూరు జిల్లా-534460 వారి (హౌసింగ్ లోన్ ఖాతా నెం.37622090462)కు తేది.04.07.2024 నాటికి రూ.74,05,275/- (అక్షరాలా డెబ్బై నాలుగు లక్షల ఐదు వేల రెండు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + తేది.05.07.2024 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.04.07.2024 న సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని రూల్సు నందలి రూల్స్ 8 & 9 లతో చదివే సదరు సెక్షన్ 13(4) ప్రకారము ది.09.09.2024న దిగువ పేర్కొన్న ఆస్తిని లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకామునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం తేది.04.07.2024 నాటికి రూ.74,05,275/- (అక్షరాలా డెబ్బై నాలుగు లక్షల ఐదు వేల రెండు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏలూరు బజార్ బ్రాంచ్, ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత మీ తదుపరి చెల్లింపులు ఏమైనా ఉంటే తగ్గించబడును.

స్థిరాస్తి వివరములు
పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, చొదిమెళ్ల గ్రామం & పంచాయితీ, ఆర్‌ఎస్ నెం. 287/2ఎ లోని, డోర్ నెం.1-125/2 వద్ద 165 చ॥గ॥లు విస్తీర్ణంలో గల ఆర్‌సిసి రూఫ్ స్టిల్ట్ గ్రౌండ్, 1వ & 2వ అంతస్తులతో గల రెసిడెన్షియల్ భవనము యావదాస్తి శ్రీ పెనుకుదురు సూరిబాబు, తండ్రి : సుబ్బారావు గారికి (రిజిష్టర్డు అమ్మకపు దస్తావేజు నెం.4185/2018, తేది.26.04.2018 ప్రకారం) చెందినది. హద్దులు : తూర్పు : 33 వెడల్పు రోడ్డు, పడమర : మామిలపల్లి సాయి లిఖిత గారి ఈ ప్లాటు, ఉత్తరం : ప్లాటు నెం.31 స్థలము, దక్షిణం : 30 అడుగుల వెడల్పు రోడ్డు.

తేది : 09.09.2024
ప్రదేశం : ఏలూరు
సం/-అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరంలో ఇంటర్నేషనల్ చదరంగం పోటీలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 13: చదరంగ క్రీడ ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని చదువుతో పాటు క్రీడాల్లో పాల్గొనాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. జిల్లా చదరంగం అసోసియేషన్, అనసూయ చెస్ ఆకాడమీ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో శుక్రవారం ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారుడు మల్లిఖార్జునరావుతో మొదటి ఎత్తు వేసి ఎమ్మెల్యే అంతర్జాతీయ చదరంగం పోటీలను ప్రారంభించారు. పోటీలలో 25 రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది పైగా క్రీడాకారులు పాల్గొనున్నారు. అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ రూ. 5 లక్షలు నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు,అసోసియేషన్ సభ్యులు తోట హరిబాబు, శివరామరాజు, మైలాపురి మురళి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ నిట్ విద్యార్థులు

ఏపీ నిట్‌లో స్వచ్ఛతా పక్వాడ

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 13 : నిట్‌లో శుక్రవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్, ప్రయత్నం క్లబ్, టాస్క్‌ఫోర్స్ క్లబ్, బృందావనం క్లబ్ సంయుక్తంగా స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిట్ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంగణంలోని అకడమిక్ భవనాలు, క్యాంటీన్, ఇండోర్ స్టేడియం, నిట్ ముఖద్వారం పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. తొలుత పరిపాలనా భవనం నుంచి నిట్ తూర్పు ముఖ ద్వారం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ శ్రీనివాస్, సంధ్యారాణి, క్లబ్ కార్యదర్శులు బీ.తరుణ్, జగదీష్, మల్లికార్జున్, ఎం.సాయి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అరకువ్యాలీ స్పోర్ట్స్ స్కూల్లో సీట్ల భర్తీకి ఆహ్వానం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 13 : 2024-25 విద్యా సంవత్సరానికి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువ్యాలీ స్పోర్ట్స్ స్కూల్లో (బాలుర) ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 17న కెఆర్ పురం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఎంపిక జరుగుతుందని ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ జి.వెంకయ్య తెలిపారు. 5వ తరగతిలో 30, 7లో 2, 8లో 2, 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన గురుకుల బాలుర పాఠశాలల విద్యార్థులు కెఆర్ పురంలో జరిగే సెలక్షన్స్‌లో పాల్గొంటారని, ఈనెల 23న అరకువెల్లిలో స్టేట్ సెలక్షన్స్ జరుగుతాయని మెరిట్ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. ఆశ్రమ, మండల పరిషత్ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

నేడు ఏలూరులో మెగా జాబ్ మేళా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: ఏలూరు గిరిజన భవన్‌లో శనివారం 11 కంపెనీల భాగస్వామ్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ టోర్నమెంట్‌కు ఎంపికైన జట్లు ఇవే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : అక్టోబరు, నవంబరు నెలల్లో జరుగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ (ఎస్జీఎఫ్) బాలికల రాష్ట్రస్థాయి టోర్నమెంట్ బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ ప్రైవేటు జూని యర్ కళాశాలల నుంచి క్రీడా ఎంపికలకు 150 మంది బాలికలు హాజర య్యారని, ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచినవారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించడానికి పంపిస్తామన్నారు. గతేడాది అండర్-19 విభాగం పోటీల్లో ఉమ్మడి జిల్లాకు నాల్గవస్థానం లభించిందని, పలు క్రీడాంశాల్లో జిల్లా బాలికలు జాతయ స్థాయి పోటీలకు వెళ్ళారని, ఈ ఏడాది కూడా మంచి క్రీడా పటిమ కనబరచాలని సూచించారు. మిగతా క్రీడా విభాగాల్లో ఎంపికలు ఈనెల 16 వరకు కొనసాగుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా డిగేల్, ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు ఇవే

కబడ్డీ జట్టుకు కె.స్వాతి సత్యశ్రీ, బి.కిరణ్మయి, టి.నాగవర్షిణి, బి.దీపిక, పి.తేజశ్వి, ఎం.చరణ్య, టి.సంజన, కె.రుషిత, ఎం.పావని, ఎం.తేజస్విని, బి.పల్లవి, కె.వసంత, కె.రోజాదీపిక, ఎం.కీర్తి, బి.ప్రసన్న, జి.మోహన విజయదుర్గ, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు బి.మోక్షిత, పి.వి.కె.కిరణ్మయి, టి.మౌనిక, ఎం.జిమ్మి, ఈశ్వరీ లతాకుమారి, ఎస్‌కె.ఫహీదా, ఎం.దుర్గాదేవి, కె.హైమశ్రీ, డి.మానస, ఎం.అమూల్య, జి.అనూష, బి.భవాని, బాస్కెట్‌బాల్‌కు పి.జయశ్రీ, కె.రోషిణిదేవి, బి.దేవిశ్రీ, డి.సాయి భవాని, ఎన్.రేణుకాదేవి, డి.మేఘన, బి.సురేఖ, ఎస్.మోహన గాయత్రి, డి.దేవీ ప్రసన్న, ఎస్.హన్సిక, ఎస్.కృష్ణవేణి, కె.పూర్ణిమజ్యోతిశ్రీ, ఎస్.భారతీ జయలక్ష్మి, డి.మౌనిక, జి.జాన్‌జోషిత, కె.సిరిప్రియ,హ్యాండ్‌బాల్ జట్టుకు కె.జానేశ్వరి, కె.జ్యోత్స్న, ఎం.దైవకృపానిధి, డి.మౌనిక, ఎం.ఎస్.సుప్రియ, జి.జాహ్నవీదేవి, డి.దేవీప్రసన్న, ఎస్.గీతాశ్రావణి, వై.లైట్‌క్వీన్ చౌదరి, ఏ.ఏసురాణి, జి.జాన్ ఇన్షిత, ఆర్.నవ్య, వి.మోక్షిత, ఎం.దుర్గాదేవి, ఎన్.శరణ్య, పి.మహేశ్వరి, జ్యోత్స్నవి, అపర్ణ, నందిని ఎంపికయ్యారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్



నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం ఆంధ్రా బెటాలియన్- విజయవాడ ఆధ్వర్యంలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్‌ను నిర్వహించారు. విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఏవో మేజర్ స్వాతీ పాండే, ఎస్ఎం రాజ్‌పాల్, జీసీఐ ఊర్మిళ ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ఎంపిక చేశారు. ఆర్జీయూకేటీ నూజివీడు ఏఎస్‌వో కెప్టెన్ సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మ

రైతుల్లో ఆనందం

కిలో రూ.50 నుంచి రూ.70



మార్కెట్‌లో నిమ్మకాయలను బస్తాలలోకి నింపుతున్న హమాలీలు

పెదవేగి, సెప్టెంబరు 13 : నిమ్మ ధర రైతుల ఆశలకు అనుగుణంగా నిలకడగా కొనసాగుతోంది. ఏడు నెలలుగా కిలో రూ.50 నుంచి రూ.100 మధ్య నిలకడగా ఉంది. దీంతో రైతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఏటికేడాది నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతుండగా ఏడు నెలలుగా ధర నిలకడగా ఉండడం ఆర్థిక వెసులుబాటుకు దోహదపడిందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ధర పెరిగినా వారం పది రోజుల వరకే ఉండేది. కానీ ఇప్పుడు ఏడు నెలలుగా ధర నిలకడగా ఉండడం ఊహించని పరిణామని రైతులు చెప్తున్నారు. దిగుబడి తగ్గడం వల్ల డిమాండ్ పెరిగిందని ఈ కారణంగానే నిమ్మకాయల ధర పెరిగిందని చాలామంది అప్పుల ఊబి నుంచి బయట పడ్డారని రైతులు చెబుతున్నారు. బయట రిటైల్ మార్కెట్‌లో కాయ ఒకటి నాలుగు నుంచి ఐదు రూపాయలకు విక్రయిస్తున్నారు.

పడిపోయిన దిగుబడి

నిమ్మకాయలు దక్షిణాది నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. సెప్టెంబరు నెలలో దెందులూరు మార్కెట్ యార్డు నుంచి సాధారణంగా రెండులారీల సరుకు వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు ఒక్క లారీ సరుకు కూడా రావడం లేదు. దిగుబడి గణనీయంగా తగ్గడంతో సరుకులేక ధర పెరిగింది. ఈ ఏడాది అధికంగా పడిన వర్షాలతో నిమ్మ పూత, కాత లేకపోయింది. పూతలేక దిగుబడి తగ్గి మార్కెట్‌కు కాయలు రాక తగ్గిపోయింది. ధర పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

ఎప్పుడూ ఇలా లేదు



ఉత్తరాది రాష్ట్రాల్లో నిమ్మకాయల వాడకం కూడా ఎక్కువగా ఉంది. దీంతో ఏడు నెలలుగా ధర నిలకడగా ఉంది. నిమ్మకాయల చరిత్రలో ఎప్పుడూ కూడా ఇన్నినెలలు నిలకడగా ఉన్న దాఖలాలు లేవు. గట్టిగా రెండు, మూడు వారాలు ధర గరిష్ఠంగా ఉండేది. ఆ సమయంలో కాయలు ఉన్న వారు దాదాపుగా 25 నుంచి 30 శాతం మంది రైతులే లాభాలను అందుకునే వారు. ఈసారి ప్రతి రైతు కూడా గరిష్ట ధరను అందుకున్నారు.

- ఆలపాటి రంగారావు, దెందులూరు మార్కెట్ యార్డు వర్తక సంఘం అధ్యక్షుడు,

పెరిగిన ఎగుమతులు



దిగుబడి తగింది. దీంతో డిమాండ్ పెరగడంతో మంచి ధర లభిస్తోంది.ఇది నిమ్మ తోటల మనుగడకు శుభసూచకంగా చెప్పవచ్చు. దాదాపు ఏడు నెలలుగా కిలో రూ.50 నుంచి రూ.100 లకుపైగా ధర లభించడం రైతుకు లాభదాయకం. చాలామంది రైతులు కొంతమేర నష్టాల నుంచి బయట పడ్డారు. కొంతమంది రైతులు ధర లేనప్పుడు చెట్లను కొట్టివేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం చేస్తున్నారు.సాగులో ఒడిదుడుకులు సహజం. అన్నింటిని తట్టుకుని నిలబడితే ఎప్పటికైనా సాగులో లాభమే ఉంటుంది..

- తాతా యశ్వంత్ రాజశేఖర్, వర్తక సంఘం పాలకవర్గసభ్యుడు, పెదవేగి

ఉపాధిహామీ పథకం అమలు చేయాలి



ఈ ఏడాది నిమ్మ కాయల దిగుబడి తగ్గింది. తక్కువ దిగుబడి వచ్చినా ధర బాగుండడంతో ఆశించిన ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగిపోయింది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరిగి పోయాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కూడా ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుంది. దీంతో పాటు ప్రభుత్వం మారింది. కాబట్టి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదే జరిగితే రైతుకు మరింత లాభదాయకంగా ఉంటుంది..

- మారగాని ప్రసాద్, రైతు, లక్ష్మీపురం

ఆగని ఇసుక దోపిడీ





పందలపర్రు ఆర్బీకే వద్ద బారులు తీరిన కొనుగోలుదారులు

ఐదు యూనిట్ల ధర రూ. 5,400

వినియోగదారుడికి మాత్రం..రూ.20 వేలు పైనే

లారీకి రూ.3 వేలు మామూళ్లు

పందలపర్రు, పెండ్యాల స్టాక్ పాయింట్లలో దందా

బుకింగ్‌లలో స్థానికులకే ప్రాధాన్యం

పాలకొల్లు, సెప్టెంబరు 13 : ఉచిత ఇసుక విధానం అబాసుపాలవుతోంది. ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వినియోగదారుడికి ఇసుక చేరేసరికి ధర తడిసి మోపెడవుతోంది.స్టాక్ పాయింట్‌లలో 20 టన్నులు (5 యూనిట్లు) ఇసుక ధర రూ.5,400లకు రశీదు ఇస్తుండగా అక్కడ రశీదులు కొట్టించే మధ్య దళారీలు రూ.3 వేలు తీసుకుంటున్నారని లారీ యజమానులు చెబుతున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాలను బట్టి లారీ ఇసుక రూ. 20 వేల నుంచి 22 వేలకు అమ్ముతున్నారు.వాస్తవానికి కిరాయితో కలిపి 5 యూనిట్లు రూ.10 వేల లోపే వినియోగదారునికి చేరాలి. కానీ రెట్టింపు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ అమలు చేయాలి

పందలపర్రు పెండ్యాల స్టాక్ పాయింట్‌లలో వర్షాల కారణంగా నాలుగు రోజులు ఇసుక ఎగుమతులు నిలిపివేశారు. గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఇక్కడ రైతు భరోసా కేంద్రాల వద్ద ఇసుక బుక్ చేసుకోవడం ప్రహసనంగా మారిందని లారీ యజమానులు వాపోతున్నారు.స్టాక్ పాయింట్‌ల వద్ద స్థానికులకే ప్రాధాన్యం ఇస్తూ దూర ప్రాంతాల లారీలకు ఇసుక బుకింగ్ ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. టీడీపీ, జనసేనకు చెందిన వ్యక్తులంటూ కొందరు దాదాగిరి చేస్తున్నట్లు తెలుస్తున్నది. వరదలు, వర్షాల కారణంగా నిర్మాణాలు నాలుగింట మూడొంతులు నిలిచిపోయాయి. ఉన్న కొద్దిపాటి నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయడానికి లారీలు బారులు తీరుతున్నప్పటికి స్టాక్ పాయింట్‌ల వద్ద టీడీపీ, జనసేన కూటమికి చెందిన లారీలకే చలానాలు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే వారంలో ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. వినియోగదారులు తమ తగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాల్లో ఇసుక బుక్ చేసుకుని సంబంధిత స్టాక్‌పాయింట్‌లు, ర్యాంప్‌లలో ఇసుక తెచ్చుకునే విధానం అమలులోకి తెస్తామని అధికారులు ప్రకటించారు.అయితే మూడు నెలలుగా వివిధ రూపాల్లో ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. జగన్‌రెడ్డి పాలనలో వేల కోట్ల రూపాయలు ఇసుకను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు చేస్తున్న పరిస్థితిల్లో కూటమి ప్రభుత్వంలోనూ అదేవిధానం కొనసాగడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.తక్షణం ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ చేసి ఆయా స్టాక్ పాయింట్‌లు, ర్యాంప్‌లలో నిఘా ఏర్పాటు చేయాలని జియో ట్యాగింగ్ విధానం అమలు చేసి ఇసుక నేరుగా వినియోగదారునికి చేరుతుందా ? లేదంటే అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయా అనే ఇషయాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.

అధికారులూ..దృష్టి పెట్టండి

ఒక వైపు వరదలు, మరో వైపు భారీ వర్షాలు కురుస్తున్నటికి ఇసుకాసురులు రెచ్చిపోతూనే ఉన్నారు.ఇపుడున్న విధానం కొనసాగితే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని పలువురు కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు.మొత్తంగా ఇసుక ధరలు కొనుగోలుదారులకు కంటిలో నలుసుగా మారగా ప్రస్తుత ఇసుక అమ్మకం విధానాలు ప్రభుత్వానికి తల పోటుగా మారింది. ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పెండ్యాల పందలపర్రు స్టాక్ పాయింట్ల వద్ద అదనంగా వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లారీ యజమానులు కోరుతున్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద రెండు మూడురోజులు వెయిటింగ్ చేయాల్సి రావడం, అదనంగా రూ. 3 వేలు మామూళ్లు ఇస్తుండటంతో కిరాయి కాస్త పెరుగుతుందని తామేమీ అన్యాయంగా వసూలు చేయడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో టిప్పర్ లారీలు సుమారు 1000 ఉండగా ఇసుక కిరాయిలు కేవలం 100 లారీలకే దక్కుతున్నాయని పలువురు లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు ఇసుక అమ్మకాల్లో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, లారీ యజమానులు కోరుతున్నారు.

క్రైం కార్నర్..

వీఆర్వోపై దాడి.. కేసు నమోదు

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 13 : రెవెన్యూకు చెందిన స్థలం ఆక్రమించుకున్న వ్యక్తిని ప్రశ్నించిన వీఆర్‌వోపై దాడిచేసిన సంఘటన గురువారం సాయంత్రం తిల్లపూడిలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిల్లపూడి గ్రామానికి చెందిన పోరంబోకు భూమిలో జొన్నల సత్యనారాయణ గతంలోనే ఇంటిని నిర్మించుకుని, దాని పక్కన ఉన్న స్థలాన్ని పశువుల పాకగా ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ దుర్గాకిషోర్ ఆదేశాలతో విచారణకు వచ్చిన ఇన్‌చార్జి వీఆర్‌వో చవాకుల ఆదినారాయణపై కత్తితో దాడి చేశాడు . చేతిపైనా, భుజంపైనా గాయాలవడంతో చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దార్ దుర్గాకిషోర్‌పై కూడా నిందితుడు దురుసుగా ప్రవర్తించడంతో తహసిల్దార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ రైటర్ మూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉంగుటూరు,సెప్టెంబరు 13 : ఉంగుటూరు బస్టాండులో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్ ఢీకొనగా తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు కారెం వెంకమ్మ(60) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం నాడు మృతి చెందింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన చేబ్రోలు పోలీసులు శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

డ్రైవర్‌కు గాయాలు.. 45 మంది ప్రయాణికులు సురక్షితం



రోడ్డుపక్కన కూర్చున్న ప్రయాణికులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13 : ముందు వెళ్తున్న లారీని అతి వేగంగా వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.డీ ఎంఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నది. ఆ బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. అర్ధరాత్రి దాటాకా ఆ బస్సు ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ దుగ్గిరాల బ్రిడ్జి వద్దకు వచ్చేటప్పటికి ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సమాచారం అందుకున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఎఎస్ఐ మూర్తి, హోం గార్డు రమేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులందరిని కిందకు దింపి వేరే బస్సులో విజయవాడ పంపించారు. గాయాలపాలైన డ్రైవర్‌ను ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం..బాలిక కిడ్నాప్

ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: బాలిక కిడ్నాప్ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకుని మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిన వ్యక్తిని, అతని తల్లితండ్రులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు. మండలంలోని కోడిగూడెంకు చెందిన ఓ మైనర్‌కు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గండికోట దశరథ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యింది. ఆ బాలికను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఈనెల 11న ఉదయం దశరథ్ అతని తల్లితండ్రులు ఎల్లయ్య,తల్లి లక్ష్మి, బాబాయి అశోక్, బావలు దండ్ల రాము, వల్లపు సురేష్‌లు కారులో వచ్చి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు కాగా పోలీసులు సవాలుగా తీసుకున్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు భీమడోలు సీఐ జోసెఫ్ విల్సన్ పర్యవేక్షణలో ఎస్ఐ సుధీర్ సిబ్బందితో కలసి బాలిక ఆచూకీ తెలుసుకుని ఆమెను తీసుకొచ్చారు. దశరథ్ అతని తల్లితండ్రులను అరెస్ట్ చేసి కిడ్నాప్‌కు వినియోగించిన కారును సీజ్ చేశారు. మిగిలిన ముగ్గురుని అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

పాఠశాలలో శానిటరీ సామగ్రి మాయం

లింగపాలెం, సెప్టెంబరు 13: పాఠశాలలోని శానిటరీ సామాగ్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. లింగపాలెం మండలం కలరాయునిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులకు సంబంధించి పాఠశాలలో ఉన్న సింకులు, వాటర్‌ట్యాప్‌లు, శానిటరీ మెటీరియల్‌ను దొంగిలించినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.దొంగిలించిన వాటి విలువ సుమారు రూ.10 వేలకు పైగా ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13 : గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తు భోగీ నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అనకాపల్లి జిల్లా కోట ఉరట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రాము నాయుడు (37) ప్రయాణిస్తున్నాడు. భోగీ రద్దీగా ఉండడం వల్ల డోర్ వద్ద నిలబడి ఉన్నాడు. ఏలూరు సమీపంలో ప్రమాదవశాత్తు అతను జారిపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

కబేళాకు తరలిస్తున్న గోవులు స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: కబేళాకు తరలిస్తున్న గోవులను నూజివీడు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండల తుక్కులూరు గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పత్రాలు లేకుండా హైదరాబాద్ లోని కబేళాకు తరలిస్తున్న 27 గోవులను స్వాధీనం చేసుకొని గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

ఒకటే రుణం.. రెండుసార్లు రికవరీ

బ్యాంకు అధికారుల తీరుపై రైతు సంఘం నాయకుల మండిపాటు

కుక్కునూరు, సెప్టెంబర్తు 13: ఒకసారి తీసుకున్న రుణానికి రెండుసార్లు రికవరీ చేసిన బ్యాంకు అధికారులు తీరును ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటాచారి తీవ్రంగా ఆక్షేపణ వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పోలవరం నిర్వాసితులకు ఒకసారి తీసుకున్న రుణాన్ని రెండుసార్లు రికవరీ చేసి రైతుల నడ్డి విరిచారని బ్యాంకు అధికారుల తీరుపై మండిపడ్డారు. 2017లో భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించారని అన్నారు. వేలేరుపాడు మండలంలోని రైతులు పరిహారం ఇవ్వకముందు బూర్గంపాడులోని ఒక బ్యాంకు బ్రాంచ్‌లో పంట రుణాలు తీసు కున్నారు. భూసేకరణ పరిహారం రైతులకు అందేలోపు బ్యాంకు అధికారులు తాము ఇచ్చిన రుణాలు రికవరీ కోసం కోర్టు నుంచి అనుమతి పొందారని దీంతో రైతులకు తెలియకుండానే రైతులకు వచ్చే పరిహారాన్ని రుణాలు రికవరీ చేసుకున్నారన్నారు. రికవరీ పోను మిగతా డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్తే మరలా రికవరీ చేసుకుని రైతులను నష్టపరిచారని తెలిపారు. దీనిపై వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి వరదలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నల్లజర్ల కృష్ణయ్య నల్లజర్ల సూర్యం, వెల్లంకి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఆరిమిల్లి సోదరుడు వివేక్.. వైటీ రాజా కుమారుడు అవినాష్

సీఎం సహాయ నిధికి విరాళాలు

తణుకు, సెప్టెంబరు 13 : విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సోదరుడు, సిరి సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆరిమిల్లి వివేక్ సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షలు శుక్రవారం అమరావతిలో అందజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, దివంగత వైటీ రాజా కుమారుడు అవినాష్ రూ.20 లక్షలు చెక్కు అందజేశారు.



స్వామివారికి పవిత్రాలను తీసుకు వెళ్తున్న అర్చకులు

మద్ది ఆంజనేయుని క్షేత్రంలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13: మండలంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేకువ జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, వాస్తుహోమం, సూత్రగ్రహణం, పోషణ, వాస్తుహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. పవిత్రాలను వేద పండితులు, ఆలయ ఈవో శిరస్సుపై పెట్టుకుని స్వామిసన్నిధికి తీసుకువెళ్లారు.



భీమవరంలో చెవి, ముక్కు, గొంతు వైద్యుల సమావేశంలో వైద్యులు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

రాష్ట్రస్థాయి సమావేశంలో వైద్యులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 13 : మనిషి శరీరంలో చెవి, ముక్కు, గొంతు అతి సున్నితమైన భాగాలని, వాటిని జాగ్రత్తగా చూసుకుని సంరక్షించుకోవాలని పలువురు డాక్టర్లు అన్నారు. రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి చెవి, ముక్కు, గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కెవి విష్ణురాజు, సంఘ అధ్యక్షులు డా.నడింపల్లి శంకర్‌కుమార్ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల బలకృష్ణంరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్యానికి ఎన్నో సరికొత్త మెలుకవలు వచ్చాయని, మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఇవి ఎంతో ఉపయరిస్తాయన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అవగాహన అవసరమని, లోపాలను ముందే గమనిస్తే పరిష్కార మార్గాలు ఎన్నో ఉంటాయన్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు చాలా మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడతుంటారని, ప్రత్యేకంగా ఈ సీజన్‌లో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయన్నారు. అనంతరం జైపూర్, ముంబాయి, కలకత్తా నుంచి పలువురు వైద్యులు సర్జరీలు మెలుకవలును నేరుగా లైవ్ ద్వారా వివరించారు. పలువురు వైద్యులు పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పీజీ విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ట్రెజరర్ ఏం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం సొమ్ములు ఇప్పించాలని రైతుల ఆందోళన

పోలవరం, సెప్టెంబరు 13 : ఆరుగాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి సొమ్ములు ఇవ్వకుండా మోసం చేసిన దళారి నుంచి ధాన్యం సొమ్ములు ఇప్పించాలని శుక్రవారం పాతపట్టిసీమ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేశారు. పట్టిసీమ గ్రామానికి చెందిన 11 మంది రైతులు 2023 సంవత్సరం జనవరి నెలలో పోలవరం గ్రామానికి చెందిన ఒక దళారికి 16 లక్షల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అప్పగించారు. ఏడాదిదాటినా ఒక్కపైసా కూడా చెల్లించకుండా మోసం చేశాడని అధికారుల స్పందించి తమ సొమ్ములు తమకు ఇప్పించాలని కోరారు.రైతులు వీరపరాజు ధర్మరాజు, సిరపారపు వెంకటరమణ, రాంబాబు, శ్రీనివాసరావు ఉన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

స్థలము అమ్మబడును

తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామంలోని శ్రీనివాస్ టాకీస్ మరియు చుట్టు స్థలము 2420 గజల స్థలం అమ్మబడును. యిల్లారి లక్ష్మి వెంకట దుర్గా ప్రసాదరావు సంప్రదించండి: 9848442249

AJN-00000

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్రయవిక్రయాలు, వ్యక్తిగతంగా లావాదేవీలు జరుపుతారు. ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడిపిటి

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: వెంకటరాయపురం, తణుకు-534 215
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్ : 08819-224911 ఫ్యాక్స్: 08819-224168
ఇ-మెయిల్: investors@theandhrasugars.com
వెబ్‌సైట్: www.theandhrasugars.com
CIN: L15420AP1947PLC000326

30.08.2024న ప్రచురించబడిన నోటీసుకు అనుబంధం

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (NSE) **12.09.2024** నాటి ఇ-మెయిల్ ఆధారంగా మరియు వారి సలహా ప్రకారం, డివిడెండ్ చెల్లింపు కోసం రికార్డ్ తేదీ **17.09.2024**గా సవరించబడింది మరియు బుక్స్ మూసివేత తేదీలు నోటీసులో ప్రచురించినట్లు కాకుండా **18.09.2024** నుండి **21.09.2024** వరకు సవరించబడ్డాయి. ఈ తేదీలను 77వ వార్షిక సాధారణ సమావేశం మరియు వార్షిక నివేదిక నోటీసులో తదనుగుణంగా సవరించినట్లు పరిగణించవచ్చు. ఈ అనుబంధం కంపెనీ వెబ్‌సైట్ www.theandhrasugars.comలో కూడా అందుబాటులో ఉంది. పైన పేర్కొన్న మార్పులను గమనించవలసిందిగా షేర్‌హోల్డర్‌లను అభ్యర్థించారు.

ప్రదేశం: వెంకటరాయపురం
తేదీ : 12-09-2024

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ తరఫున
పి. నరేంద్రనాథ్ చౌదరి
ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్

వచ్చేనెల నుంచి ధాన్యం సేకరణ : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 13: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ప్రణాళికతో రైతులు సంతృప్తి చెందేలా ధాన్యాన్ని సేకరించేందుకు సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, ట్రాన్స్‌పోర్టర్లు తదితరులతో ధాన్యం సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చునని అంచనా ఉండగా అందులో సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో వరి పండే ప్రతి గ్రామంలో దిగుబడి అంచనా ప్రకారం 3 కేటగిరీలు చేసి 247 ధాన్యం రైతు సేవా కేంద్రాలను క్లస్టరింగ్ ద్వారా కొనుగోలు కేంద్రాలుగా గుర్తించటం జరిగిందన్నారు. అక్టోబరు 2వ వారం నుంచి ప్రారంభమై ఫిబ్రవరి నాటికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా నెలల్లో ఎంత మేర ధాన్యం వస్తుంది అంచనా వేసి అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. దళారులు నుంచి మోసపోకుండా రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేలా రైతులను అవగాహన పరచాలన్నారు. రైతులకు అనువైన విధంగా ధాన్యం సేకరణ కేంద్రాలను మిల్లులకు సమన్వయం చేయాలన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అదే విధంగా డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో ధాన్యం సేకరణ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఖరీఫ్‌లో ధాన్యం ను క్వింటాలుకు కామన్ రకం రూ.2300, ఏ-గ్రేడ్ రకం రూ.2320, చొప్పున ప్రభుత్వం వారు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు.

17న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : జిల్లావ్యాప్తంగా ఈ నెల 17న నులిపురుగుల నిర్మూల నకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్ళు, కళాశాలల్లో విద్యార్థులకు అల్బెం డజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మాత్రల పంపిణీపై ముద్రించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఏలూ రులో ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరా లలోపు వారికి పేగుల్లో నులిపురుగులవల్ల ఎదుగుదల మందగించడం, నీరసం, రక్తహీనత, చదువులో ఏకాగ్రతను కోల్పోవడంవంటి రుగ్మతలు వస్తున్నాయని, వీటిని నివారించేందుకే అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. 17న మాత్రలు వేసుకోనివారికి ఈ నెల 25న మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, ఆర్బీఎస్కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 13 : వరసిద్ధి వినాయక ఆలయం వద్ద చవితి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం వద్ద స్వామి వారికి, ఉత్సవ విగ్రహానికి, పూజలు చేశారు. అర్చకులు కె.చిరంజీవిశర్మ సామూహికంగా మహిళతో కుంకుమార్చనలు చేయించారు. శనివారం అన్న సమారాధన జరుపుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెప్పారు.

అట్టహాసంగా వినాయక నిమజ్జనం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: వినాయక నిమజ్జన వేడుకలు ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. చిత్రవిచిత్ర వేషధారణలు, తీన్‌మార్ వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఆర్చిగేడు వద్దనున్న మందిరంలోని వినాయకుడిని ప్రత్యేక వాహనంపై విగ్రహాన్ని ఉంచి వైభవోపేతంగా గణేష్ మహరాజ్‌ను ఊరేగించి నిమజ్జనం జరిపారు.

గణపతికి మేయర్ దంపతుల పూజలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 13: ఆర్ఆర్‌పేట విజయవిహార్ సెంటర్‌లో జరుగుతున్న శ్రీగణపతి మహోత్సవ కార్యక్రమాల్లో మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్.పెదబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్న సమారాధన



పెదపాడు, సెప్టెంబరు 13 : పెదపాడు శివారు రామచంద్రపురంలో శుక్రవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయం యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు మూడు వేలమంది అన్న ప్రసాదాలను స్వీకరించారు. తొలుత పవన్ దీక్షితులు ఆధ్వర్యంలో గణపతి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, గ్రామస్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టి.నరసాపురం: బండివారిగూడెంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పోలవరం: గణపతి నవరాత్రుల సందర్భంగా పోలవరం పంచాయతీ జెస్సావీధిలో రామాలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి భారీ విగ్రహానికి పుష్పార్చన చేసి మండపానికి పుష్పాలంకరణ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు రెండువేల మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ కోరశిక శ్రీనివాస్, యాదవ సంఘ అధ్యక్షులు కోరశిక నాగబాబు, కేతా దేవకీ తదితరులు భారీ విరాళాలు అందించి సహకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పాయల శ్రీను తెలిపారు.


జీఎస్టీ రిటర్న్‌ల దాఖలుపై అతిథి ఉపన్యాసం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : 'జీఎస్టీ మూలాలు-జీఎస్టీ రిటర్న్‌ల దాఖలులో ఆచరణాత్మక అంశాలు' అనే అంశంపై శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో అతిథి ఉపన్యాసం జరిగింది. చార్టెడ్ అకౌంటెంట్ దింటకుర్తి శివకిషోర్ మాట్లాడుతూ రిటర్న్‌ల దాఖలు చేయడంలో కాలపరిమితులపై విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు, ప్రిన్సిపాల్ రామరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో హిందీ భాషాదినోత్సవం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : హిందీ భాషాదినోత్సవాన్ని శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించారు. ప్రాచ్యభాషా విభాగం హెచ్‌వోడి డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ దేశ ఐక్యతకు హిందీభాష ఉపయోగపడుతుందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం హిందీని నేర్చుకోవాలని సూచించారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలో హిందీ ద్వితీయస్థానంలో ఉందని పేర్కొన్నారు. కరస్పాండెంట్ కె.వి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరికి తైలవర్ణ చిత్రంతో నివాళులు



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : భారతదేశం గర్వించతగ్గ మహానేత ఏచూరి సీతారామ్ మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనకు నివాళిగా స్థానిక శనివారపుపేట జడ్పీ హైస్కూలు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఎండి.ఇర్షాద్ అహ్మద్ తైలవర్ణ చిత్రాన్ని గీశారు. సీతారామ్ నిష్క్రమణ ఎంతో కలచివేసిందని అన్నారు. మచ్చలేని మహామనిషి, విద్యార్థి దశనుంచే అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి దేశంలో వామపక్ష భావజాలాన్ని విస్తృతంగా తీసుకెళ్ళిన సీతారామ్ ఏచూరి మతశక్తులకు వ్యతిరేకంగా, రైతుకూలీ ఉద్యమాలకు సిద్ధాంతకర్తగా అన్ని రాజకీయపార్టీల నుంచి గౌరవంపొందిన నాయకునిగా కీర్తిని సాధించారని నివాళులర్పించారు.



కొణికి వద్ద కాజ్‌వేపై నిలిచిన వరదనీరు

కాజ్‌వేపై నిలిచిపోయిన వరద నీరు

పెదపాడు, సెప్టెంబరు 13: కొణికి గ్రామ సమీపంలో వున్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కాజ్‌వేపై వరదనీరు 10 రోజులుగా నిలిచిపోయి ఉండటంతో గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొణికి గ్రామ ప్రజలు మండల కేంద్రమైన పెదపాడు, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, సత్యవోలు, కడిమికుంట గ్రామ ప్రజలతో పాటుగా పరిసర గ్రామాల ప్రజలు కొణికి మీదుగా కుదరవల్లి, గుడివాడ వైపు వెళ్లాలన్నా ఈ కాజ్‌వే దాటాల్సిందే. లోయేరు మొత్తం పూడుకుపోయి ఉండటం, ఆక్రమణలతో పైనుంచి వచ్చిన వరదనీరు కిందికి పోయే మార్గం లేకుండా పోయింది.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



భీమడోలు, సెప్టెంబర్ 13 : బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన వాహనాన్ని టీడీపీ యువనేత గన్ని భరత్ కుమార్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా బ్రాహ్మణుల సహకారంతో పంపిణీ చేపట్టడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాశీభొట్ల పార్వతీశ్వరశర్మ, కోశాధికారి మురళీకృష్ణ, సుబ్బారావు, ఉపాధ్యక్షులు వాసుదేవరావు, నారాయణాచార్యులు, సత్యేంద్రకుమార్, ప్రభాకరరావు, భీమడోలు జనసేన అధ్యక్షుడు ప్రత్తి మదన్, నాయకులు పాల్గొన్నారు.

పెదవేగి: పెదపాడు మండలం సత్యవోలు గ్రామానికి చెందిన రైతులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.50వేలు విరాళాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పల పాటి శ్రీరామ్‌ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, నాగరాజు, నాగరాజు, గాంధీ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



భీమడోలు, సెప్టెంబరు 13 : పూళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ పంపిణీ జరిగింది. ముఖ్య అతిథులుగా తాడేపల్లి గూడెం ఆర్టీసీ మేనేజర్ వైసత్య నారాయణమూర్తి, పాసులకు ఆర్థిక సహాయం అందజేసిన కందులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మొత్తం 150 మందికి ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. సర్పంచ్ సుజాత, హెచ్ఎం భువనేశ్వరరావు, ఆర్టీసీ పీఆర్‌వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీవో 85 రద్దు చేయాలి



బొర్రంపాలెంలో ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

టి.నరసాపురం, సెప్టెంబరు 13: జీవో నెంబర్ 85 రద్దు చేయాలని కోరుతూ మండలంలోని బొర్రంపాలెం ప్రభు త్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం వైద్య సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ఎస్.కె ఇమాంబి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 85 ఇవ్వడం దారుణమన్నారు. జీవోతో వైద్యులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇంతకాలం చేసిన సర్వీస్ ఉపయోగం లేకుండా పోయిందన్నారు.

స్కౌట్స్ విద్యార్థుల విరాళాల సేకరణ

కామవరపుకోట, సెప్టెంబరు 13 : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ విద్యార్థులు వరద బాధితుల కోసం 18,116 రూపాయల విరాళాలు సేకరించారు. ఆ నగదును హెచ్ఎం ఉమ్మడి భీమరాజుకు స్కౌట్స్ మాస్టార్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు శుక్రవారం అందచేశారు.

స్వచ్ఛతా హీ సేవను విజయవంతం చేయాలి

కామవరపుకోట, సెప్టెంబరు 13 : ఈనెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కామవరపుకోట ఎంపీడీవో కె.శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

దేశం గర్వించదగ్గ మేధావి సీతారాం ఏచూరి

పెదపాడు, సెప్టెంబరు 13 : దేశం గర్వించగదగ్గ గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. సీపీఎం పెదపాడు శాఖ ఆధ్వర్యంలో సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను నల్లా ఆంజనేయులు భవనంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

చింతలపూడి, సెప్టెంబరు 13:చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్లు, డ్రెయినేజీలు, సీసీరోడ్ల మరమ్మతులు, వివిధ రకాల పనులు దాని ప్రతిపాదనలు వివరిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రతిపాదనలు అందచేసి ఈ పనులను త్వరగా పరిష్కారమయ్యే విధంగా చేయాలని కోరారు.

ముత్యాలమ్మకు పూజలు

చింతలపూడి, సెప్టెంబరు 13: స్థానిక వెలమపేటలోని ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూజలు జరిపారు. ముత్యాలమ్మ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న తొలిపూజా కార్యక్రమంలో ఆయన ఈ పూజలు జరిపారు.

ఎన్టీఆర్ ఇళ్ళ లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వండి

చింతలపూడి, సెప్టెంబరు 13: 2014-18 మధ్యకాలంలో నిర్మించుకున్న ఎన్టీఆర్ ఇళ్లలబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆర్డర్‌కాపీని గృహనిర్మాణ డిఈకి అందచేసి లబ్ధిదారుల వివరాలను తెలియచేయాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశించారు. ఐదేళ్ళకాలంలో 2800 మందికి బిల్లులు ఇవ్వాల్సి ఉందని, వీరందరికి తెలుగుదేశం ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఇద్దరు విద్యుత్ శాఖ అధికారుల సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13: జంగారెడ్డిగూడెం మండలంలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన కంకిపాటి నాగరాజు విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాగరాజు మృతి చెందాడని ఆయన కుమారుడు జ్యోతిరాదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఎఈ జోసెఫ్, జూనియర్ లైన్‌మ్యాన్ వెంకటేశ్వరరావులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు విద్యుత్ శాఖ డీఈఈ రాధాకృష్ణ తెలిపారు. అలాగే అవుట్ సోర్సింగ్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న నిమ్మకాయల మణికుమార్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని కాంట్రాక్టర్‌కు సూచించామని, లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ సింగ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు డిఈఈ తెలిపారు.



రూ.2లక్షల విరాళం చెక్కును ఎమ్మెల్యే రోషన్‌కు అందిస్తున్న ప్రగడవరం టీడీపీ నేతలు

వరద బాధితులకు విరాళాలు

చింతలపూడి: ఏపీ వరద బాధితులకోసం చింతలపూడి మండలానికి చెందిన పలువురు దాతలు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు ఆయన కార్యాలయంలో శుక్రవారం నగదు రూపంలోనూ, చెక్కుల రూపంలోనూ రూ.3లక్షల25వేలు అందచేశారు.

ఉంగుటూరు: విజయవాడ వరద బాధితులకు శుక్రవారం నాడు నారాయణపురం 999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఎమ్మెల్యే ధర్మరాజుకు రూ.30వేల మొత్తాన్ని అందించారు.

అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణం



సరిపల్లె గ్రామంలో సీసీ.రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 13: అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు తెలిపారు. సరిపల్లె గ్రామంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబు, గడ్డమలుగు రవికుమార్, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, సర్పంచ్ తాడేపల్లి గోపి, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, కొయ్యలగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, మద్దు తేజ పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాలకు రూ.4 లక్షల సాయం

కొత్తగా ఇళ్లు నిర్మించుకునే పేద ప్రజలకు రూ.4లక్షలు ప్రభుత్వ సహాయం అందిస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సరిపల్లె గ్రామంలో సర్పంచ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా అర్హులైన పేద ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం రూ.4లక్షలు అందజేస్తుందన్నారు.

గోతులమయంగా బయ్యన్నగూడెం రహదారి



కొయ్యలగూడెం, సెప్టెంబరు 13: బయ్యన్నగూడెం నుంచి ధర్మారావుపేట వెళ్ళే రహదారికి మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారి గుండా పెద్దపెద్ద గోతులపడి ఆ గోతులు కాస్త చెరువులుగా మారిపోవడ ంతో వాహనాలు వెళ్ళే పరిస్థితిలేదు. ఈ రహదారిలో బయ్యన్నగూడెం, సరిపల్లె, ధర్మారావుపేట, వేదాంతపురం, గ్రామాలున్నాయి. ఇటీవల వర్షాలకు పెద్దపెద్ద గోతులుపడిపోవడంతో ఆ గోతుల్లో వాహనాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. నిత్యం ఈ గ్రామాల నుంచి మండల కేంద్రం కొయ్యలగూడెం రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

అర్జీల స్వీకరణ



మంగళగిరి జనసేన కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, సెప్టెంబరు 13: మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ పిడుగు ప్రసాద్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజానీకం అర్జీలను సమర్పించారు.

నారాయణపురం కళాశాలకు బి ప్లస్ గ్రేడ్

ఉంగుటూరు, సెప్టెంబరు 13: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈనెల 2,3 తేదీలలో నాక్ బృందం పరిశీలించింది. అనంతరం బి ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రెడ్డియ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యాపక బృందం,నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి సాగిరాజు జానకి రామరాజు, పొత్తూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొని ర్యాంకు రావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: హిందీ భాషా దినోత్సవం పురస్కరించుకుని గుణ్ణంపల్లి జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్ర మాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ముందుగా విద్యార్థులతో పాఠశాలలో పూర్తిగా హిందీలో మాట్లాడించడంతో పాటు హిందీ భాష ప్రాధాన్యతను వారికి వివరించారు. హిందీ భాషపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించినట్లు టీచర్ శ్రీనివాస్ తెలిపారు. హిందీ టీచర్ లీలాకుమారిని ఘనంగా సత్కరించారు.

పాదయాత్రగా క్షేత్రానికి



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: చినవెంకన్న క్షేత్రానికి పాదయాత్రగా పలు వురు యాత్రికులు శుక్రవారం సాయం త్రానికి విచ్చేశారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. రెండో శనివారం, ఏకాదశి కావడంతో విశేషసంఖ్యలో ఆలయానికి భక్తులు రావచ్చని అధికా రులు భావిస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఆలయానికి పాదయా త్రగా వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

గౌడసంఘ కల్యాణ మండప నిర్మాణం పనులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: ద్వారకాతిరుమలలో గౌడసంఘ కల్యాణ మండప నిర్మాణం కోసం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్థలం కేటాయింపునకు హామీ ఇవ్వడంతో అఖిల భారత గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ చంద్ర శేషు శుక్రవారం కొబ్బరి కాయకొట్టి పనులు ప్రారంభించారు. అడగగానే తమ సంఘా నికి అరెకరం స్థలం కేటాయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలన్నారు.

పెదవేగి సీఐగా వెంకటేశ్వరరావు



పెదవేగి, సెప్టెంబరు 13: పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా కె.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెదవేగి ఎస్ఐగా పనిచేశారు. ఆ తరువాత సీఐగా పదోన్నతి పొందిన ఆయన ఏలూరు రూరల్ సీఐగా పనిచేశారు. తిరిగి ఇప్పుడు పెదవేగి సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

సెన్సర్ల ఆవశ్యకతపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : ఆధునిక జీవితంలో సెన్సర్ల ఆవశ్యకత, వినియోగం పెరిగాయని, సంకేతాల ఆధారంగా ఇవి అవసరాలకు అనుగుణంగా పనిచేయడమే సెన్సర్ల ప్రత్యేకత అని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడి డాక్టర్ నిర్మలజ్యోత్స్న అన్నారు. నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థినులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవజీవితాన్ని విజ్ఞానంద్వారా సులభతరం, సుఖవంతం చేయడానికి సెన్సర్లను ఉపయోగించి వివిధ రకాల పరికరాలను తయారుచేస్తున్నారని వివరించారు. వివిధ రకాలు సెన్సర్లు, వాటి ఆపరేటింగ్ సిస్టంలను విద్యార్థినులు ప్రదర్శించారు. నృత్యరూపకంతో సెన్సర్ల పనితీరుని ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల పాల్గొన్నారు.

నేడు టీచర్లకు యూటీఎఫ్ ఆటల పోటీలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఆటల పోటీలను శనివారం ఉదయం 9గంటల నుంచి ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన మండల, డివిజన్‌స్థాయి పోటీల్లో విజేతలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

వరద గ్రామాల్లో నిత్యావసరాల పంపిణీ



రుద్రమకోటలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు

వేలేరుపాడు, సెప్టెంబరు 13: గోదావరి వరద చుట్టుముట్టిన గ్రామాల్లోని ప్రజలు పనులులేక బయట ప్రాంతాలకు వెళ్ళే వీలులేక ఇబ్బందులుపడుతున్న గ్రామాల ప్రజలకు ప్రభుత్వం కుటుంబానికి 25కిలోల బియ్యం, పామాయిల్, పంచదార, కందిపప్పుతో పాటు కూరగాయాలను శుక్రవారం నాడు దాదాపు 30గ్రామాల్లో పంపిణీ చేశారు. రుద్రమకోట గ్రామంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వాల క్రాంతికుమార్, అమరవరపు వెంకన్న, శాబిలి సుభాష్‌చంద్రబోస్, ముదిగొండ రామకృష్ణ, వెంకట్రావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహార ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్

వేలేరుపాడు, సెప్టెంబరు 13: గర్భిణులు, చిన్నారులు పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీకుమారి సూచించారు. శుక్రవారం నాడు శివకాశీపురం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం లోపం ఏర్పడితే తల్లిబిడ్డకు రక్తహీనత, నెలలు నిండకముందే కాన్పు, పుట్టిన బిడ్డ శరీరక, మానసిక రోగం, ప్రాణపాయం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అనంతరం శివకాశీపురం బాలికల పాఠశాల విద్యార్థినిల అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బీజేపీకి భాగస్వామ్యం కల్పించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13:కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యం అని ప్రభుత్వ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులకు సమాచారం అందించి ప్రొటోకాల్‌లో పేర్లు ఉండేలా చూడాలని బీజేపీ సీనియర్ నాయకుడు అంబికాకృష్ణ అన్నారు. శుక్రవారం బీజేపీ ఏలూరుజిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

జనసేనలో చేరిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో నాయకులు పార్టీలోకి రావడం సంతోషం కలిగిస్తోందని, జనసేన ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం ఏలూరు సెలానాగ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, జనసేన రాష్ట్రకార్యదర్శి పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామానికి చెందిన వైసీపీ, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లతో సహా సుమారు 200మంది జనసేనపార్టీ తీర్థం తీసుకున్నారు. వీరికి ఎమ్మెల్యేలు పార్టీకండువాకప్పి ఆహ్వానించారు. జనసేన ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో క్రీడా సంబరాలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)క్రీడాపోటీలు ప్రారంభం కావడంతో జిల్లావ్యాప్తంగా మండలపరిషత్ పాఠశాలల్లో సందడి నెలకొంది. గత కొన్నేళ్ళుగా పాఠశాల క్రీడాపోటీలు కొవిడ్ కారణంగా మూలనపడ్డాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం క్రీడాపోటీలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్.జి.ఎఫ్ పోటీలు ప్రారంభం కావడంతో సందడి నెలకొంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మండలస్థాయిలో పోటీలను పూర్తి అయ్యేలా నిర్ణయించారు. మండలస్థాయి నుంచి నియోజకవర్గ జిల్లాస్థాయి వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

లింగపాలెం, సెప్టెంబరు 13:విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంఈవో రామారావు అన్నారు. సింగగూడెం ప్రాథమిక పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామారావు మాట్లాడుతూ మండలస్థాయి క్రీడలు మూడు రోజులు జరుగుతాయని ప్రథమ స్థాయిలో నిలిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయిలో జరిగే ఆటల పోటీలకు ఎంపిక చేస్తామని అన్నారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.అలివేలు మంగతాయారు, పీహెచ్‌వీ ప్రకాష్‌రెడ్డి, శ్యామల, లక్ష్మి, కామేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆటోనగర్ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: తన కుమారుడిని 2 గంటల పాటు చిత్రహింసలు పెట్టిన ఏలూరు ఆటోనగర్ అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠినచర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు మరకాల మురళీ,శ్యామల డిమాండ్ చేశారు. శుక్రవారం మల్కాపురంలో ఉన్న ఆటోనగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

తన కుమారుడు ఆటోనగర్‌లో పెయింటింగ్ పని చేసుకుంటాడని, కొద్దిరోజుల క్రితం మద్యం మత్తులో స్క్రాప్‌లో ఉన్న ఒక డిస్క్‌ను తీసి అమ్మాడని తెలిపారు. అయితే ఆ డిస్క్‌ను దొంగతనం చేసి అమ్మాడని ఆటోనగర్ అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు ఆటోనగర్‌లో ఎటువంటి సంబంధం లేదని శివ, జాగీర్ అనేవ్యక్తులు ముగ్గురు కలిసి తన కుమారుడు దినేష్‌ను 2 గంటల పాటు చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. అంతేకాకుండా ఆటోనగర్‌లో గతంలో జరిగిన చోరీలకు సంబంధించి తన కుమారుడుని బాధ్యుడుగా చేయడం తగదన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం

పెదవేగి, సెప్టెంబరు 13: పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి పంచాయతీలోనూ పనులు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.శ్రీనివాస్ చెప్పారు. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 22వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి సంబంధించి పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉందని, డ్రెయిన్లు శుభ్రపర్చి, సున్నం, బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయడం చేయాలని ఆయన సూచించారు. ఎంఈవో -2 వి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ కమిటీల సహకారంతో పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోగులంపాడు ప్రధాన రహదారిలో పడిన గండి

మంత్రి ఆదేశాలూ బేఖాతర్!

ప్రధాన రహదారి గండిని పూడ్చని అధికారులు

ముసునూరు, సెప్టెంబరు 13: గోగులం పాడు-అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారికి ఏర్పడిన గండిని పూడ్చాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎర్రకాలువ వరద ఉధృతికి ఈ రహదారిపై సిమెంట్ తూరలు కొట్టుకుపోయి గండి పడిందని, రెండు వారాలుగా రెండు గ్రామాల మధ్యల రాకపోకలు నిలిచి పోయాయని స్థానికులు పేర్కొన్నారు. రహదారికి గండివల్ల పంట పొలాల్లోకి వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన మంత్రి పార్థసారథి ఈ గండిని పరిశీలించి, వెంటనే తాత్కాలికంగా సిమెంట్ తూరలు వేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి గండిపూడ్చి రాకపోకలు పునరుద్ధరించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కైకలూరులో కామినేనికి విరాళాలు అందజేస్తున్న విలేకర్లు

రూ.50 వేలు విరాళమందించిన విలేకర్లు

కైకలూరు, సెప్టెంబర్ 13: వరద బాధితులను ఆదుకునేందుకు విలేకర్లు విరాళాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రూ.50 వేల విరాళాలను వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే కామినేనికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలుగులోకి తేవడమే గాక సామాజిక కార్యక్రమాల వైపు విలేకర్లు పయనించడం అభినందనీయమన్నారు.



నూజివీడులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: నూజివీడు మండల స్థాయి క్రీడా పోటీలను ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర విభాగంలో అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం ఎంపి కలను విజయవంతంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్.ఎం పద్మ, ఎంఈవో జమలయ్య పోటీలను ప్రారంభించారు. వ్యాయా మోపా,ధ్యాయులు లక్ష్మి, వనజ, రాణి, రాజేంద్ర ప్రసాద్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోను నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికల పోటీలను ఎంఈవో సుబ్బారావుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ అలీఖాన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర పోటీల ను ఫిజికల్ డైరెక్టర్లు వాకా నాగరాజు, సుకుమార్, హేమ నిర్వహించారు. టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), తులిమెల్లి రంగారావు, తోట శ్రీనివాసరావు, హెచ్ఎం ఎ.సునీలరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కబేళాకు తరలిస్తున్న గోవుల స్వాధీనం



గోశాలకు తరలించిన గోవులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: కబేళాకు తరలిస్తున్న గోవులను నూజివీడు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండల తుక్కులూరు గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పత్రాలు లేకుండా హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్న 27 గోవులను స్వాధీనం చేసుకొని నున్న గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో కమిటీ జాగ్రత్తగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఇటీవల భారీ వర్షాలకు చెరువులన్నీ నీటితో నిండుగా ఉండటంతో విగ్రహ నిమజ్జన కార్యక్రమాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలను నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సాయం అర్థిస్తూ వాహనాల్లో సరుకు చోరీ?

ఆగిరిపల్లి, సెప్టెంబరు 13: అకాల వర్షాల వల్ల ముంపునకు గురైన విజయవాడ ప్రకాష్‌నగర్, కండ్రిక, సింగ్‌నగర్ ప్రాంతాల్లో పలువురు దోపిడీకి పాల్పడుతున్నారని బాధితులు వాపోయారు. విజయవాడ నుంచి ఇతర గ్రామాలకు వెళ్ళే సరుకు రవాణా ఆటోలను ఆగంతకులు ఆపి డ్రైవర్లను ఆర్థిక సాయం అడుగుతున్నట్టు నటించి ఆ వాహనాల్లోని సరుకును వెనుక నుంచి కొందరు దోపిడీ చేస్తున్నట్టు ఆలస్యంగా సమాచారం అందింది. ఆగిరిపల్లికి చెందిన వ్యాపారులు యండూరు నరసింహమూర్తికి సంబంధించిన వస్తువులు తీసుకువస్తున్న ఆటోను ప్రకాష్‌నగర్‌లో గల నున్న పోలీస్‌స్టేషన్ ఎదురుగా కరెంటు లేని సమయంలో సహాయాన్ని అర్థిస్తున్నట్టు ఆపి వెనుక కట్టిన తాడు కత్తిరించి సుమారు రూ.40 వేలు వస్తువులు అపహరించుకుపోయారు. అదేరోజు నూజివీడు వ్యాపారి బాస్మతి బియ్యం మూటలు ఆటోలో తీసుకు వస్తుండగా వాహనం తాడు కత్తిరించి 4 మూటలు అపహరించినట్లు తెలిసింది.

మొలాసిస్ లీక్.. పలువురికి గాయాలు

నూజివీడు, సెప్టెంబరు 13: తుక్కులూరు బైపాస్ సమీపంలో శుక్రవారం రాత్రి మొలాసిస్ ట్యాంకర్ నుంచి మొలాసిస్ లీక్ అవ్వడంతో పలువురు ద్విచక్ర వాహనదారులకు గాయాల య్యాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మొలాసిస్‌ను రహదారిపై నుంచి తొలగించారు. నూజివీడు ఫైర్ సిబ్బంది, విజయవాడ ముంపు ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తూండటంతో మైలవరం ఫైర్ ఆఫీస్ నుంచి ఫైర్ వెహికల్‌ను రప్పించి చర్యలు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా

ముదినేపల్లి, సెప్టెంబరు 13 : వర్షాల వల్ల ముంపునకు గురైన ముదినేపల్లి మండలం పెయ్యేరు - దాకరం రహదారి నేటికీ తేరుకోలేదు. దీంతో పది రోజులుగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం ఆ రహదారిలో పెయ్యేరు నుంచి దాకరం వరి గడ్డి ట్రక్కుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. రహదారికి రెండు వైపులా ఉన్న పొలాలు ముంపులో ఉండటంతో డ్రైవర్ జాగ్రత్తగా వెళదామనుకున్నప్పటికీ ట్రాక్టర్ జారిపోయి ట్రక్కుతో సహా బోల్తా పడింది.



కైకలూరులో బీసీ బాలుర వసతి గృహంలోకి చేరిన వరద నీరు

వీడని వరద

ముంపులోనే రహదారులు.. పొలాలు

కైకలూరు, సెప్టెంబరు 13: కొల్లేరు వరద ముంపుతో కైకలూరులోని పలు రహదారులు నీటమునిగాయి. ఎక్కడికక్కడే కాలువలు, డ్రైన్లలో నీటి పారుదల లేకపోవడంతో రహదారులు ముంపునకు గురయ్యాయి. కైకలూరు 1, 2 వార్డులలో ఉన్న కోర్టు, బీసీ బాలుర వసతి గృహం, మత్స్యశాఖ కార్యాలయం ముంపు బారిన పడ్డాయి. బాలుర వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులు ముంపునకు గురైన నీటి నుండి దుర్గంధం వెదజల్లడం, దోమలు ఎక్కువగా ఉండడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. అలాగే 7, 8 వార్డులలో ముంపు తగ్గకపోవడంతో ప్రజలు ఆ నీటిలోనే రాకపోకలను సాగిస్తున్నారు. ఫైర్ ఆఫీస్ వద్ద మోటార్లతో వరద నీటిని అధికారులు బయటకు తోడుతున్నారు. అనేక గ్రామాల్లో ఎక్కడికక్కడే సున్నం, బ్లీచింగ్ చల్లుతూ పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు.



ముదినేపల్లిలో ముంపులోనే వరి పొలాలు

ముంపులోనే పొలాలు

ముదినేపల్లి: కొల్లేరు, ఉప్పుటేరుల వరద ఉధృతికి ముదినేపల్లి ప్రాంతంలోని మూడు మేజర్ డ్రెయిన్లు స్తంభించాయి. కొల్లేరులో నీటి మట్టం తగ్గక పోవడంతో పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్, ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహి స్తుండడంతో పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్లు, వాటికి సం బంధించిన మీడియం, మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం నిలిచి పోయింది. దీంతో పోల్‌రాజ్, కొమ్మిలేరు పరీవాహక ప్రాంతాల్లోని వేలాది ఎకరాల్లోని సార్వా వరి పైరు ముంపు నుంచి తేరుకోవడం లేదు.

నూజివీడు నియోజకవర్గంలో దెబ్బతిన్న ఇళ్లు..

నూజివీడు: భారీ వర్షాలకు నూజివీడు పరిధిలో 32 గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయని నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల 130 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. దాదాపు 300 గృహాలు ముంపుకు గురైనట్టు గుర్తించామన్నారు. 200 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్టు ప్రాథమిక అంచనాల ద్వారా నిర్ధారణ అయిందన్నారు.



కొండంగి పల్లిపాలెంలో తహసీల్దార్ ముంపు పరిశీలన

ముంపు గ్రామాలను పరిశీలించిన అధికారులు

కలిదిండి, సెప్టెంబరు 13 : మండలంలో ఉప్పుటేరు పొంగటంతో ముంపునకు గురైన మద్వానిగూడెం, కొండంగి పల్లిపాలెం గ్రామాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి జాబితా తయారు చేస్తామని, బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వరద నీరు తగ్గే వరకు బాధితులు పునరావాస కేంద్రంలో ఉండాలన్నారు. బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఉప్పుటేరు నీటి మట్టం పెరుగుతుండటంతో గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకు వస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు ఉప్పుటేరులోకి చేపల వేటకు వెళ్లరాదన్నారు. చేపల వేటకు ఉపయోగించే నాటు పడవలను ఒడ్డుకు చేర్చాలన్నారు. ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఏచూరికి ఘన నివాళి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల శుక్రవారం ఆగిరిపల్లి ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు, ఆగిరిపల్లి మండల కార్యదర్శి సీహెచ్ శివనాగరాజు, నూజివీడు టౌన్ కార్యదర్శి హనుమాన్లు, సీపీఐ నాయకులు సత్తు కోటేశ్వరరావు, ఎం.రాజారావు, రాజులపాటి చంటి, ఎం.నరేష్, రవీంద్ర, బాషా, అయ్యప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి సంతాప సభను నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు, నూజివీడు మండల కమిటీ సభ్యుడు పాలేటి సుభాష్ చంద్రబోస్, లక్ష్మయ్య, ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. ప్రజాసంఘాల నాయకులు సామ్యేలు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఏచూరికి నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి మృతి వామపక్ష రాజకీయాలకు ప్రధానంగా జాతీయ రాజకీయాలకు తీరనిలోటు అన్నారు. ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన మహానేత ఏచూరి అని పేర్కొన్నారు.



నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయండి

కైకలూరు, సెప్టెంబర్ 13: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 17న బాలలందరికీ నులిపురుగుల మాత్రలను అందజేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిని కె. అన్నపూర్ణ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలను అందజేయాలన్నారు. వైద్య సిబ్బంది అంగ న్వాడీలు సమిష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైద్య సిబ్బంది జి శ్రీనివాసరావు, కె తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో చంద్రశేఖర్

స్వచ్ఛతే సేవ విజయవంతం చేయాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 13 : పారిశుధ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛతే సేవ - 2024 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టి కృషి చేయాలని ఏలూరు డీఎల్‌పీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామాల్లో చెత్త కుప్పలను తొలగించటం, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించటం లాంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, మండవల్లి ఈవోపీఆర్డీ ఆనంద్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాల మంజూరులో మార్పులు

నూజివీడు, సెప్టెంబరు 13: ఉపకార వేతనాల మంజూరు విధి విధానాల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటున్నట్లు నూజివీడు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాస రావు అన్నారు. నూజివీడు ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహ సముదాయంలో నూజివీడు డివిజన్ పరిధిలోని సచివాలయ సిబ్బందితో ఉపకార వేతనాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఉపకార వేతనాలను విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేయగా, ఆ విధానాల్లో కొద్దిపాటి మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంద న్నారు. ఎస్సీ ఎస్టీల విద్యార్థుల తల్లుల ఖాతాలో ఉపకార వేతనాలు జమ అవుతుండగా బీసీ, ఓసీలకు జాయింట్ అకౌంట్‌లలో ఉపకార వేతనాలు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి సచివాలయ ఉద్యోగులు ఖాతాలను పొందుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హెచ్‌డబ్ల్యూవోలు కల్యాణ్ శ్రీనివాస్, రమణారావు, రాజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన ర్యాలీ

చాట్రాయి, సెప్టెంబరు 13: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా చాట్రాయి మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ చాట్రాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, కిషోర బాలికలు, గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టేందుకు పోషకాహారాన్ని విధిగా అందించాలని నినాదాలిచ్చారు. సూపర్‌వైజర్ పి.గాయత్రిదేవి, టి.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఏలూరులో మెగా జాబ్ మేళా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: ఏలూరు గిరిజన భవన్‌లో శనివారం 11 కంపెనీల భాగస్వామ్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల హాజరును ప్రదర్శించాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 13 : పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పట్టికను ప్రతి రోజూ తరగతి గదుల్లో ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రతి తరగతిలోను మొత్తం విద్యార్థుల సంఖ్య హాజరైన విద్యార్థుల సంఖ్య హాజరు కాని విద్యార్థుల సంఖ్యకు సం బంధించిన వివరాలను తరగతి గదిలోని బోర్డుపై రాయాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు ఈ ఆదేశాలను పాటించాలని పేర్కొన్నారు. దీనిపై డీఈవోలు, ఎంఈవోలు తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.



కలిదిండి.. ముసునూరు.. ముదినేపల్లి మండలంలోని పెయ్యేరు కాలనీలో పూజలందుకుంటున్న గణనాథులు

ఘనంగా చవితి ఉత్సవాలు

ముసునూరు, సెప్టెంబరు 13: మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు శుక్రవారం ముసునూరు పోలీస్ స్టేషన్ సమీపంలో కొలువుదీరిన మహాగణపతికి విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.పవన్‌కుమార్, పి.కాసులు, జి.ధర్మారావు తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో భారీ అన్నస మారాధనలను గణేష్ ఉత్సవ కమిటీలు నిర్వహించాయి. బత్తులవారిగూడెం ఎస్టీ కాలనీలో స్వామివారి నిమజ్జనం సందర్భంగా టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. వెంకటాద్రిపురంలో అన్నసమారాధన నిర్వహించారు.

కలిదిండి: మండలంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కలిదిండి, పెదలంక, కోరుకొల్లు మండపాల్లో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని సీఐ కృష్ణకుమార్ తెలిపారు. నిమజ్జనాలకు అనుమతు లు తీసుకోవాలన్నారు.

ముదినేపల్లి: గణపతి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనాలు, అన్నసమారాధనలు జరిగా యి. పెయ్యేరు కాలనీలో గణపతికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, దాకరం పీఏసీఎస్ మాజీ చైర్మన్ జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్, పెయ్యేరు టీడీపీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వీరాస్వామి, ఎంపీటీసీ [illegible], పెనుమల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ [illegible] సతీష్ తదితరులు పూజలు జరిపి, అన్నసమారాధనలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనాలు జరిగాయి.



నూజివీడు మండలంలో అన్నదానం



నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నృత్య రూప యోగా

ఆకట్టుకున్న యోగా ప్రదర్శన

ప్రధాని వద్ద ప్రదర్శించేందుకు సహకరిస్తానన్న ఎంపీ మహేష్

నూజివీడు, సెప్టెంబరు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ శాక్ ఆడిటోరియంలో యోగశాల విద్యార్థుల యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్, నూజివీడు ట్రిపుల్ ఐటీ సందర్శన సందర్భంగా యోగశాల విద్యార్థులు నమామి గాంగే గీతానికి లయబద్ధంగా నృత్యరూపకంలో యోగా ప్రదర్శన చేసి ప్రజాప్రతినిధులను మెప్పించారు. ఈ సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రదర్శనను మెచ్చుకుంటూ ప్రధాని మోదీ వద్ద ప్రదర్శన చేసేందుకు సహకరిస్తానని ఈ సందర్భంగా ఎంపీ విద్యార్థులకు హామీ ఇచ్చారు.



ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం ఆంధ్రా బెటాలియన్ - విజయవాడ ఆధ్వర్యంలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్‌ను నిర్వహించారు. విద్యార్థుల కు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఏవో మేజర్ స్వాతీ పాండే, ఎస్ఎం రాజ్ పాల్, జీసీఐ ఊర్మిళ ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ఎంపిక చేశారు. ఆర్జీయూకేటీ నూజి వీడు ఏఎస్‌వో కెప్టెన్ సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి డైరెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూజివీడు సీఐ బాధ్యతల స్వీకారం



సత్య శ్రీనివాస్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: నూజివీడు పట్టణ సీఐగా పీవీ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయ వాడ కోర్టు మానిటరింగ్ సెల్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను నూజివీడు పట్టణ సీఐగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన ఎంవీవీఎస్ఎన్ మూర్తిని బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నూజివీడు, సెప్టెంబరు 13: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.నాగశైలజ తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు కక్షిదారులు తమ న్యాయవాదుల ద్వారా లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ప్రధానంగా బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులు తదితరాలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, సెప్టెంబరు 13 : పామర్రు - నర్సాపురం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామం వద్ద విద్యుత్ పనుల నిర్వహణకు శనివారం కోడూరు, పేరూరు 11 కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.రవికుమార్ ప్రకటనలో తెలిపా రు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పై ఫీడర్లలోని గ్రామా లకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

రహదారిపై గండి పూడ్చివేత



ముసునూరు, సెప్టెంబరు 13: మండలంలోని చెక్కపల్లి వద్ద సంధ్యవాగు వరద ఉధృతికి వంతెన కూలి రహదారికి పడిన గండి పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదిక జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ డీఈ బాబురావు, ఏఈ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం గండిలో 20 సిమెంట్ తూరలు వేసే పనులను పూర్తిచేశారు. శనివారం వీటిపై గ్రావెల్ వేసి, తాత్కాలికంగా రాకపోకలను పునరుద్ధరిస్తామని, వారం రోజుల తరువాత గ్రావెల్‌పై కంకర వేసి తారు వేస్తామని డీఈ తెలిపారు.

కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి, సెప్టెంబరు 13: దివ్యాంగులు కృత్రిమ అవయవాలు అమర్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలని వర్ధమాన నటుడు ఆర్యన్ గౌరా అన్నారు. తోటపల్లిలో హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సంఘ సేవకులు బోగిరెడ్డి, ప్రియాంక, కాకరాల, నాగ బిందు శ్రీ(అమెరికా), సినీ హీరో ఆర్యన్ గౌరా ఆర్థిక సాయంతో భద్రాచలానికి చెందిన కారం మానస, తీగల హారిక, వరంగల్‌కు చెందిన కర్రి స్వాతి, రాజమండ్రికి చెందిన వీర్ని దీప్తిశ్రీలకు కృత్రిమ కాళ్ళను అందజేశారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎల్.ఎస్ రాజు, వల్లూరి రాజ్యలక్ష్మి, అరవపల్లి సుగుణ, గౌరా జ్యోతికుమారి, సీనియర్ టెక్నీషియన్ చిన్నా, అవయవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లబోయినపల్లిలో వైద్య శిబిరం

ముసునూరు, సెప్టెంబరు 13: చిల్లబోయినపల్లిలో శుక్రవారం వైద్య సిబ్బంది సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు గుర్తించి చికిత్స అందించినట్టు వైద్యాధికారిణి ఇవాంజలి తెలిపారు. బీపీ, షుగర్, కాళ్లనొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి మందులను అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ మురళీమోహన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, విజయవాడ-3 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా... (లేటు) సుద్దపల్లి నాగభూషణం గారి కుమారుడు సుద్దపల్లి కాసులు గారి ఆస్తిని తనఖా పెట్టుకొని సుద్దపల్లి అరవింద్ బీఫ్ కాసులు గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు సుద్దపల్లి అరవింద్ బీఫ్ కాసుల గారికి ఋణం మంజూరు చేయుదురు. షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మంగళగిరి మున్సిపల్ ఏరియాలో చేర్చిన అస్తి నా పేరిట ది.15.2.2005వ తేదీన మంగళగిరి 11వ వార్డు కాపువర్గపుదారు సుద్దపల్లి చిన్న సుబ్బారావు గారి భార్య అప్పమ్మ గారు ఒక దఖలు దస్తావేజు వ్రాయించి శ్రీ మంగళగిరి సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1 పుస్తకం, నెం. 1483/2005వగా రిజిష్టరు చేయించిన దఖలు దస్తావేజు ద్వారా నాకు దాన విక్రయాది సమస్త సంపూర్ణ హక్కులతో సంక్రమించి నేటి వరకు నా స్వాధీన సంపూర్ణ హక్కు భుక్తములందు వుంది ఈ రోజున సదరు దఖలు పరిచిన ఖాళీ నివేశన స్థలంకు హద్దులు (డోరు నెంబరు 11-201 సమీపమున) తూర్పు : కుటికోటి కోటేశ్వరరావు గారి యింటి స్థలం హద్దు, దక్షిణం : తమ్ముడు బాబూరావు గారి ఖాలీ స్థలం హద్దు, పడమర : కుక్కమళ్ల వెంకన్న గారి ఖాలీ స్థలం హద్దు, ఉత్తరం : మున్సిపల్ బజారు హద్దు. యీ హద్దుల మధ్య వున్న చ.గ. 7.5ల లేక చ.మీ. 60.48లు ఖాళీ నివేశన స్థలం మాత్రమున్నా. DOC NO : 8293/2005, S.R.O. మంగళగిరి.

టి.వి.ఎస్. వాసుదేవరావు, న్యాయవాది, గుడివాడవారివీధి, విజయవాడ. సెల్ నెం: 98494 31432

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, విజయవాడ-3 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా... కొమ్మినేని చెన్న కృష్ణయ్య గారి కుమారుడు కొమ్మినేని కేశవ గారి ఆస్తిని తనఖా పెట్టుకొని కొమ్మినేని రమాదేవి గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు కొమ్మినేని రమాదేవి గారికి ఋణం మంజూరు చేయుదురు. షెడ్యూలు : వైయస్.ఆర్. కడప డి., మైదుకూరు సబ్.డి., మైదుకూరు మున్సిపాలిటీ, యస్.మైదుకూరు గ్రామ పొలం, 9వ వార్డు మాయిగస్, వెంకటాపురం రోడ్డు, రెసిడెన్షియల్ ఏరియాలో డోర్ నెం. 9/105-72గా గల ఇంటికి సమీపంలో గల బీడువు స్థలమునకు వివరం. సర్వారు పుంజి సర్వే నెంబరు 1821పైకి య 0.34 సెంట్లు ఈ పైకి య 0.14 సెంట్లు లేక 0.056 హెక్టార్లు లేక 677.6 చదరపు గజాలు. ఇందుకు హద్దులు తూర్పు : చొక్కం పొలక్క గారి సంజన్న గారి స్థలము, పడమర : వెంకటాపురంకు పోవు రస్తా, ఉత్తరం : నేను ఈ దినం కొమ్మినేని కృష్ణమోహన్ గారికి సెటిల్‌మెంట్‌గా వ్రాయించి ఇచ్చిన స్థలము, దక్షిణం : చింతల ఓబులేసు గారి భూమి, ఈలోపైన పదునాలుగు సెంట్లుగా గల బీడువు స్థలము అనగా 677.6 చదరపు గజాలుగా గల బీడువు స్థలమున్నా. DOC NO : 1530/2023, S.R.O. మైదుకూరు.

టి.వి.ఎస్. వాసుదేవరావు, న్యాయవాది, గుడివాడవారివీధి, విజయవాడ. సెల్ నెం: 98494 31432